ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శుక్రవారం 13 సెప్టెంబరు 2024
గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.7462)	1,23,987	1,24,943
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.85 (4.16)	1,352	483.3
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.32 (43.20)	71,863	16,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.160 | స్కిన్‌లెస్ : రూ.190



పవర్ ప్లాంట్‌లో.. దొంగలు ..పడ్డారు

- రూ.100 కోట్ల మేర చోరీ సామగ్రి బయటకు వెళ్లినట్లు సందేహాలు
- పటిష్ట భద్రత ఉన్నప్పటికీ విచ్చలవిడిగా దొంగతనాలు
- కీలకవ్యక్తుల అండదండలతోనే అక్రమదందా
- రాజకీయ పలుకుబడితో కేసుల విచారణ నీరుగారుతోందని విమర్శలు

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో వెలుగులోకి వస్తున్న దొంగతనాలు విస్తుగొల్పుతున్నాయి. తుక్కు పాత ఇనుము, రాగి, అల్యూమినియం వస్తువుల చోరీ జరుగుతుందనే అంశంపై 2017నుంచి అడపాదడపా కేసులు నమోదవుతున్నా కట్టడికి సీరియస్‌గా చర్యలు చేపట్టకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన దొంగతనంతోపాటు, మూడునెలల క్రితం బయటపడిన చోరీ వ్యవహారాలతో ప్లాంటు నుంచి భారీగా ఇనుము బయటకు తరలిందని తెలుస్తోంది. కీలకమైన వ్యక్తుల ప్రమేయంతో సుమారు రూ.100 కోట్లకు పైగా విలువైన ఇనుము, సామగ్రి బయటకు వెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

నల్లగొండ జిల్లా వీర్లపాలెంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటు నుంచి ఒక్క ఇనుప ముక్క బయటకు రావాలన్నా పలు తనిఖీలు జరుగుతాయని, అలాంటి చోట ఇంత భారీ చోరీలు జరుగుతుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు రూ.100కోట్ల విలువైన ఇనుము, సామగ్రి ఇప్పటికే అక్రమంగా బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెలుగులోకి వచ్చిన దొంగతనాలకే పోలీస్ విచారణ పరిమితమవుతుందే తప్ప, అంతకుమించి లోతుగా జరగడం లేదని, రాజకీయ, అధికారవర్గాల పరమైన ఒత్తిళ్లతో విచారణను అక్కడికక్కడికే పరిమితం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్లాంట్‌లో జరుగుతున్న దొంగతనాలు, ఇనుము అక్రమ తరలింపు, డీజిల్ చోరీ అంశాలపైనా పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మొత్తం కుంభకోణం బయటకు వస్తుందని, పోలీస్ ఉన్నతాధికారులు, బీహెచ్‌ఈఎల్, జెన్‌కో అధికారులు ఈ దర్యాప్తు చేపట్టాలనే డిమాండ్ సర్వత్రా వెల్లడవుతోంది.

పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఉన్నప్పటికీ..

రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.40వేలకోట్ల అంచనా వ్యయంతో దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌ను నిర్మిస్తోంది. ఇక్కడ భద్రత నిమిత్తం ప్లాంట్ పరిధిలో మొత్తం భారీ ప్రహరీ నిర్మించారు. ఏ వస్తువు, వ్యక్తి, వాహనం లోపలకు వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా మెయిన్‌గేట్ నుంచే అనుమతిస్తారు. పైగా ప్లాంటు చుట్టూ సీసీ కెమెరాల నిఘా కూడా కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం పాస్‌లు, అనుమతి పత్రాలుంటేనే ఎవరినైనా, ఏ వాహనాన్ని అయినా లోపలకుగానీ, బయటకు గానీ అనుమతించేలా భద్రతా వ్యవస్థ కొనసాగుతోంది. ప్రత్యేకంగా సీఆర్ఎఫ్ బలగాలు ఇక్కడ ఓ డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో భద్రత కొనసాగిస్తుంటే, మరోవైపున సివిల్ పోలీసులు తమ పర్యవేక్షణను ఏర్పాటు చేశారు. పైగా జెన్‌కో విజిలెన్స్ కార్యాలయం ఇక్కడే ఏర్పాటు చేసింది. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఇక్కడ విజిలెన్స్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇంత పటిష్టమైన భద్రత ఉన్న ప్రాంతంలో చిన్నబోల్టు పట్టుకోవాలన్నా సామాన్యులకు వెన్నులో వణుకుపుడుతుంది. అయితే ఇక్కడ భారీగా ఇనుము, అల్యూమినియం, పాత ఇనుము, రాగి, ఉక్కు, వినియోగించిన తర్వాత వదిలేసే తుక్కు పెద్దఎత్తున చేరుతుండడంతో దీనిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు వీటిని బయటకు తరలించి సొమ్ముచేసుకునేందుకు రంగంలోకి దిగారు.

కీలక స్థానాల్లో ఉన్న వారితో కుమ్మక్కేనా..?

ఇక్కడ పనిచేసే కీలకమైన స్థాయిలో ఉన్న జెన్‌కో సిబ్బందితోపాటు, బీహెచ్‌ఈఎల్‌కు చెందిన సిబ్బంది, కాంట్రాక్ట్ సంస్థల సిబ్బందితోపాటు, భద్రతా విధుల్లో ఉన్నవారు ఒక బృందంగా ఏర్పడి, బయట రాజకీయ పలుకుబడి, అధికారవర్గాల్లో చెలామణి అయ్యేవారితో కలిసి ఈ అక్రమదందాకు తెరలేపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వారి సహకారంతోనే ఇక్కడి నుంచి కోట్ల రూపాయల విలువైన ఇనుము, ఇతర సామగ్రి బయటకు తరలిందని చెబుతున్నారు. ఇక్కడ పనిచేసే కార్మికులను, ఈ ప్లాంటులోకి వచ్చే వాహనాల డ్రైవర్లు, కూలీలను, కాంట్రాక్ట్ సంస్థల్లో పనిచేసే వారిని ఇక్కడినుంచి ఇనుమును బయటకు తీసుకెళ్లేందుకు వినియోగించి ప్లాన్ ప్రకారం ఈ దొంగతనాలు నిర్వహిస్తున్నట్లు చర్చ సాగుతోంది. కీలకమైన వ్యక్తుల కనుసైగలతోనే ఈ దందా సాగుతుండడం వల్లే, అడపాదడపా పట్టుబడ్డ సంఘటనల్లోనూ విచారణను ఆ ఒక్క ఘటనకే పరిమితం చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కూలీలు, వాహనాల డ్రైవర్లు, ఆ దొంగతనంలో పట్టుబడిన వారికే కేసును పరిమితం చేస్తున్నారే తప్ప ఈ దొంగతనాలకు మూలమైన కీలక వ్యక్తులను ఎందుకు విచారించడం లేదనే ప్రశ్నలకు సమాధానం కొరవడింది.

సమగ్ర విచారణకు డిమాండ్



ప్లాంటు నుంచి దాదాపు రూ.100 కోట్ల విలువైన సామగ్రి అడ్డదారిలో బయటకు వెళ్లిందనే ఆరోపణలు, వరుస దొంగతనాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణను చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా కీలకమైన అధికారులు, రాజకీయ పలుకుబడి గలిగిన వారు, అధికార వర్గాలను, పోలీసులను ప్రభావితం చేసే వ్యక్తులు ఈ వ్యవహారంలో భాగస్వాములవడం వల్లే ఈ చోరీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ.100 కోట్లకుపైగా విలువైన సామగ్రి బయటకు తరలినా ఇటు జెన్‌కో, అటు బీహెచ్‌ఈఎల్ ఉన్నతాధికారులు సమగ్రవిచారణ జరపకపోవడానికి వారిని ప్రభావితం చేస్తున్న కారణాలేమిటనే దానిపై పలురకాల విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఈ పవర్‌ప్లాంటుకి ఏ రకమైన మెటీరియల్ ఎంత వచ్చింది..? అందులో ఎంతమేర వినియోగించారు..? మిగిలిన మెటీరియల్ ప్రస్తుతం ఎంత నిల్వ ఉంది? తుక్కుగా మారింది ఎంత ? అనే రికార్డులను పరిశీలించే ప్రక్రియను జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఈ స్టాక్‌ను నిల్వ ఉంచే స్టాక్‌యార్డు భద్రత పరిస్థితి..? దొంగతనాలు వెలుగులోకి వచ్చినప్పుడు దొరికిన దొంగల వరకే కేసుని పరిమితం చేస్తున్న అంశం..? దొంగతనాలకు సూత్రధారులెవరు...? ప్లాంటునుంచి భారీస్థాయిలో ఇనుము బయటకు ఎలా వస్తుంది? విచారణ ముందుకు సాగకుండా అడ్డుపడుతున్న సూత్రధారులు ఎవరో నిజం నిగ్గుతేల్చాలని, పాత్రధారులతో పాటు సూత్రధారులపైనా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వెల్లడవుతోంది. సమగ్ర విచారణ చేపట్టకపోతే ప్రభుత్వరంగ సంస్థల ప్రతిష్ట దెబ్బతింటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రశాంత వాతావరణంలో

శోభాయాత్ర నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 12 : ప్రశాంత వాతావరణంలో వినాయక శోభాయాత్ర జరిగేలా అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. వినాయక శోభాయాత్ర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో, మండలాల్లో నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అపశ్రుతులు జరుగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జన కార్యక్రమ పర్యవేక్షణకు అధికారులకు విధులు కేటాయించామని, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది విడతల వారీగా 24 గంటల విధులు నిర్వహించాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో క్రేన్స్ ఏర్పాటు, ఫ్లడ్‌లైట్స్ ఏర్పాటు చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

17న ప్రజాపాలన దినోత్సవం

కలెక్టరేట్‌లో ఈ నెల 17వ తేదీన ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో పీడీ అప్పారావు అన్నారు. అన్నిశాఖలకు చెందిన అధికారులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎనిమిది గంటల్లోపు అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఉదయం తొమ్మిది గంటల్లోపు కలెక్టరేట్‌కు రావాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సతీష్‌కుమార్, ఆర్డీవో వేణుమనోహర్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, సీపీవో కిషన్, డీఈవో అశోక్‌కుమార్, డీఐఈవో లక్ష్మణ్‌నాయక్, సంక్షేమ అధికారులు లత, పద్మ, సీతారాం, అనసూయ, వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, నర్సింహారావు, రామచంద్రరావు, జగదీష్‌రెడ్డి, జానయ్య, ఆదిత్య, మాధవన్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన ఉండాలి



సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 12 : సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా సైబర్ మోసగాళ్లు అనేక రకాలుగా సైబర్‌నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజల బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బును దొంగలించేలా నేరగాళ్ల ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అపరిచితులకు ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను తెలపవద్దన్నారు. సైబర్‌మోసానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930 టోల్‌ఫ్రీనెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాల నివారణపై జిల్లా సైబర్‌సెల్ పటిష్ఠంగా పనిచేస్తోందన్నారు.

- ఏపీ సీఎంతో మంత్రి ఉత్తమ్ దంపతులు



ఏపీ రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడును మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు విజయవాడలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు.

- సూర్యాపేట టౌన్ / హుజూర్‌నగర్

- సీతారాం ఏచూరికి నివాళి



హుజూర్‌నగర్‌లో నాయకుల నివాళులు,



నల్లగొండలో జరిగిన జాతీయ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న ఏచూరి(ఫైల్)

సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం కన్నుమూశారు. ఆయనతో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఉన్న అనుబంధాన్ని ఆ పార్టీ శ్రేణులు గుర్తుచేసుకున్నాయి. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ నివాళులర్పించారు.

8

నిండా మునిగాం..ఆదుకోండి సారూ

- కేంద్ర బృందానికి రైతుల వేడుకోలు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 12: 'అయ్యా రెండు పంటలకు నీళ్లులేక ఇబ్బందులు పడ్డాం, ఈ సీజన్‌లో నీళ్లొచ్చాయని సంతోషంతో సాగు చేశాం, ఇంతలోనే భారీ వర్షాలకు అన్నిపంటలు నీటమునిగాయి, మీరే ఆదుకోవాలి' అంటూ హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో వరద నష్టం అంచనాకు గురువారం వచ్చిన కేంద్ర బృందాన్ని రైతులు వేడుకున్నారు. గ్రామంలో వరద తాకిడితో దెబ్బతిన్న పొలాలను, గండిపడిన చెరువును కేంద్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులు వారితో తమ బాధలను మొరపెట్టుకున్నారు. లక్షల వెచ్చించి సాగు చేశామని, బూరుగడ్డ, కరక్కాయలగూడెం, గోపాలపురం ప్రాంతాల్లో 1,000 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. నల్లచెరువు కట్ట తెగి పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, తొలగించాలంటే ఎకరానికి రూ.50వేలుకు పైగానే ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నష్టాన్ని గుర్తించాం, ప్రభుత్వాలకు నివేదిస్తాం

రైతులు వర్షాలకు పెద్దమొత్తంలో నష్టపోయిన విషయాన్ని గుర్తించామని కేంద్ర బృంద సభ్యులు తెలిపారు. ఏరైతుకు ఎంతనష్టం జరిగింది అనే వివరాలు కూడా సేకరిస్తున్నామని, పూర్తి నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామన్నారు. నల్లచెరువు కట్ట బలహీనంగా ఉండడంతో కట్ట తెగిందన్నారు. వరదతో బూరుగడ్డ- గోపాలపురం మధ్య రోడ్డు తెగిందన్నారు. పంట నష్టం సమాచారాన్ని తెలుసుకొని అంచనా వేస్తున్నామన్నారు. పొలాలలో ఇసుక మేటలను గమనించామన్నారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించినట్లు తెలిపారు. రైతాంగానికి అన్ని విధాల మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.



తొగర్రాయిలో వరద ధాటికి ఇల్లు కోల్పోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఫొటో ఎగ్జిబిషన్

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వరద నష్టంపై ఆర్డీవో కార్యాలయంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దెబ్బతిన్న ఇల్లు, పొలాలు, రోడ్లు, చెరువులకు సంబంధించిన ఫొటోలను ఆర్డీవో శ్రీనివాసులు కేంద్ర బృందానికి చూపిస్తూ నష్టం వివరాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్ర పరిశీలకులు రాకేష్ మీనా, నియలకన్నన్, డాక్టర్ శశివర్ధన్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖాధికారి రామకృష్ణ, రవీందర్‌నాయక్, డీఈ వెంకటకృష్ణయ్య, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు రమేష్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, అనిల్‌కుమార్, తహసీల్దార్ నాగేందర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై చర్యలేవీ?

కోదాడ రూరల్: భారీవరదలు, వర్షాలు తగ్గి వారం రోజులైనా ప్రభావిత గ్రామాల్లో పారిశుధ్య చర్యలు సక్రమంగా చేపట్టలేదని వరద నష్టం అంచనా కోసం వచ్చిన కేంద్ర బృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. అనంతగిరి మండలం గోండ్రియాల, కోదాడ మండలం తొగర్రాయి గ్రామాల్లో బృందం పర్యటించింది. వరదలతో నష్టాన్ని కల్నల్ కేపీసింగ్, మహేష్‌కుమార్, శాంతినాథ్ శివప్ప బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ముంపునకు గురైన ఇళ్లు, వరదలో మునిగి ఇసుకమేటలు వేసిన పొలాలను, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని కలెక్టర్ తేసజ్ నందలాల్ పవార్ వారికి వివరించారు. ఇతర వివరాలను కలెక్టర్‌ను బృందం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రతీ ఇంట్లో బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పార్వతమ్మ, గౌరారపు రవికి చెందిన కూలిన ఇళ్లను కేంద్ర బృందం పరిశీలించి ప్రభుత్వం సహాయం అందిందా అని అడిగి తెలుసుకున్నారు. స్థానికులు, రైతులు తమ సమస్యలను కేంద్ర బృందానికి తెలిపేందుకు ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, డీఈ వెంకటకృష్ణయ్య, వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ రఘు, తహసీల్దార్లు హిమబిందు, వాజిద్‌అలీ, ఏడీఏ ఎల్లయ్య, ఎంపీడీవో రాంచందర్‌రావు, ఎంపీవో పాండురంగయ్య పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఖమ్మం నుంచి అనంతగిరి మండలం గోండ్రియాలకు వచ్చిన కేంద్ర బృందానికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్వాగతం పలికారు. వారిని ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి పొలాలు, ఇళ్లను చూపించారు.

కూచిపూడి బాధితుల నిరసన

కేంద్రబృందం తమ గ్రామానికి రాకపోవడంపై కూచిపూడి గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం బృందం గ్రామంలో పర్యటిస్తుందని చెప్పడంతో బాధితులు గంటలకొద్దీ నిరీక్షించారు. తీరా బృందం రావడంలేదని తెలిసి నిరాశచెందారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా సమయాభావంతోనే కేంద్ర బృందం సందర్శించ లేదన్నారు.

భరోసా ఇవ్వని కేంద్ర బృందం పర్యటన

కేంద్ర బృందం పర్యటనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కుబడిగానే పర్యటించిందే తప్ప బాధితులకు అండగా ఉంటామని, ఆదుకుంటామని చెప్పిన దాఖలాలు లేవంటున్నారు. ప్రతీ గ్రామంలో 20నిమిషాలకు మించి ఎక్కువసేపు పరిశీలించలేదని బాధితులు తెలిపారు. కలెక్టర్‌ను అడిగారే తప్ప తమను అడగలేదన్నారు. గోండ్రియాలలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని రైతులు తెలిపారు.

రవాణా శాఖలో చక్రం తిప్పుతున్న ఏజెంట్లు

ఆంధ్రజ్యోతి విజిట్

- అన్నింట్లోనూ వారిదే హవా
- డబ్బులిచ్చి చాటుగా పనులు చక్కబెడుతున్న వైనం
- కార్యాలయాల్లోని సిబ్బంది సహకారం

రోడ్డు రవాణా కార్యాలయాల్లో ఏజెంట్ల హవా సాగుతోంది. ఏ పని కావాలన్నా వారికి ఎంతోకొంత ముట్టజెప్పాల్సిందే. కాదుకూడదని ఎవరైనా నేరుగా వెళ్తే అవిలేవు, ఇవి లేవూ అంటూ కార్యాలయం చుట్టూ తిప్పి విసిగి ఏజెంట్లను కలిసేలా చేస్తున్నారు. సూర్యాపేటలో ఎవరికీ దొరక్కుండా ప్రత్యేక కోడ్ విధానాన్ని పాటిస్తున్నారు. ప్రాంగణంలోనే ఉంటూ పనులు చక్కబెడుతున్నారు. అసౌకర్యాల మధ్య అద్దె భవనాల్లో కొనసాగుతున్న చోట్ల సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది.

- భానుపురి, కోదాడరూరల్



సూర్యాపేట ఆర్టీవో కార్యాలయంలో ఏజెంట్ల దందా గుట్టుచప్పుడుగా కొనసాగుతోంది. గతంలో కార్యాలయంలో తనిఖీలతో కాస్త మార్పు కనిపించినా, ఏజెంట్లు కార్యాలయ ప్రాంగణంలో ఓ మూలకు ఉండి పనులు చక్కబెట్టుకుంటున్నారు. సుమారు 10మంది ఏజెంట్ల హవా ఇక్కడ నడుస్తోంది. ఏజెంట్లు వాహనదారుల దరఖాస్తులను కోడ్ విధానం పాటిస్తూ(దరఖాస్తుపై ఏజెంట్ పేరుతో పెన్సిల్‌తో రాసి పంపించడం) అందిస్తున్నారు. ఆయా దరఖాస్తులకు ఇంత అన్నట్లు ఇద్దరు ఉద్యోగులు సాయంత్రం ఏజెంట్ల వద్దకు వెళ్లి తీసుకుంటున్నట్లు సమాచారం. వాహనాన్ని బట్టి వేలల్లో ముట్టజెప్పాల్సి వస్తోంది. ఏజెంట్ల ద్వారా కాకుండా నేరుగా వెళ్లిన వాహనదారుడికి పనులు కావడం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే కంప్యూటర్ పరీక్షల్లో ఫెయిల్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సీసీ కెమెరాలు సైతం పనిచేయడంలేదని వాహనదారులు అంటున్నారు.

ప్రతి పనికీ ఖరీదు

రవాణా శాఖా కార్యాలయాల్లో ఏజెంట్లు, సిబ్బంది దరఖాస్తుదారుల నుంచి మామూళ్ల వసూలు చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌కు రూ.500, ట్రాక్టర్, కారు లాంటి వాహనాలకు రూ.1200 నుంచి రూ.1500 వరకు ఏజెంట్లు కార్యాలయంలో ముట్టజెప్పుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రతిపాదనలకే సరి

కోదాడలో ఎంవీఐ బిల్డింగ్ కోసం అనేకసార్లు ప్రతిపాదనలు పంపించారు. ఆర్టీవో భవన కోసం ఐదు ఎకరాల భూమి అవసరం. అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద నాలుగున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. భూమి కేటాయిస్తే కార్యాలయం నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోతాయి.

అద్దె భవనం.. అసౌకర్యాల మయం

ఇది కోదాడ సమీపంలోని తమ్మర గ్రామం వద్ద ఉన్న ఆర్టీవో కార్యాలయం. అద్దె భవనంలో కొనసాగుతోంది. ఏడాదికి రూ.4 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూరుస్తున్నా సొంత భవనం లేదు. అసౌకర్యాల మధ్య అటు సిబ్బంది, వాహనదారులు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు సిబ్బంది కొరత వేధిస్తోంది. క్లర్క్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద కూడా సిబ్బంది కొరత ఉంది. ఐదు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి ప్రతిపాదనలు పంపినట్లు ఎంవీఐ జిలానీ తెలిపారు.

ఏజెంట్ల బెడద లేదు

సూర్యాపేట రవాణా శాఖ కార్యాలయంలో ఏజెంట్ల దందా లేదు. నేరుగా వాహనదారులు స్లాట్‌బుక్ చేసుకుని పనులు చేసుకుంటున్నారు. ప్రైవేట్ వ్యక్తులు ఎవరూ కార్యాలయంలో పని చేయడంలేదు.

- సురేష్‌రెడ్డి, సూర్యాపేట ఆర్టీవో

స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నాం



కోదాడ ఎంవీఐ కార్యాలయం సుమారు 10 ఏళ్లకు పైగా అద్దె భవనంలో కొనసాగుతోంది. సరైన సౌకర్యాలు లేక సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు స్థలం ఇస్తే ప్రభుత్వం పక్కా భవనానికి నిధులు మంజూరు చేస్తుంది. శాంతినగర్ గ్రామానికి దగ్గరలో స్థలాన్ని పరిశీలించాం.

- జిలానీ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



లోక్‌అదాలత్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి గోవర్ధన్‌రెడ్డి

సూర్యాపేట లీగల్, సెప్టెంబరు 12 : కేసుల సత్వర రాజీపూర్వక పరిష్కారానికి నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి ఎస్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం కోర్టులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌అదాలత్‌లతో పరిష్కారాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, అత్యధిక కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలన్నారు. లోక్‌అదాలత్‌లో న్యాయవాదులదే కీలకపాత్రన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పీ శ్రీవాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జే ప్రశాంతి, ఆయా ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులర, ఇన్సూరెన్స్ న్యాయవాదులు, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల కొరత తీర్చేందుకు కృషి

తుంగతుర్తి, సెప్టెంబరు 12: జిల్లాలోని వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో వైద్యుల కొరత తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన తుంగతుర్తి ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తన పరిధిలోని కోదాడ, హుజూర్‌నగర్, నడిగూడెంతో పాటు తుంగతుర్తి ఆసుపత్రులు ఉన్నాయన్నారు. ఈ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత ఉందన్నారు. వైద్యుల కొరత విషయాన్ని తాను ఎప్పటికప్పుడు అధికారులకు విన్నవించడంతో పాటు ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వైద్యుల నియామకం కోసం రిక్రూట్‌మెంట్ చేసిందని త్వరలో ఈ ఆసుపత్రుల్లో వైద్యులను నియమిస్తారన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నిర్మల్‌కుమార్ పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకస్వాములు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 12: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 11,41,912 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ఉండాలి

నాగార్జునసాగర్, సెప్టెంబరు 12: ఎయిడ్స్ నియంత్రణపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అవగాహనతోనే ఆ వ్యాధిని నివారించవచ్చని ఎయిడ్స్ నియంత్రణ అధికారి మచ్చానాయక్ అన్నారు. గురువారం ఆయన సాగర్ హిల్‌కాలనీ బీసీ గురుకుల కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ, నర్సింహ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాగర్‌లో 10గేట్లు ఎత్తి నీటి విడుదల

- *కొనసాగుతున్న విద్యుదుత్పత్తి*



నాగార్జునసాగర్‌లో 10 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్, సెప్టెంబరు 12: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక పెరగటంతో గురువారం సాయంత్రం 10 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. గురువారం వరద రాక పెరగడంతో ఉదయం 9 గంటలకు 2 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు మధ్యాహ్నం 3 గంటలకు మరో 6 గేట్లు, సాయంత్రం 6 గంటలకు మరో 2గేట్లు మొత్తం 10 గేట్లనుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 1,23,987 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 589.90 అడుగులుగా(311.7462టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9387 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 3146 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,110 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం 26 గేట్లలో 10 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 80,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,24,943 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 1,23,987 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీ ఆయకట్టుకు రెండో విడత సాగునీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులో సాగు చేసిన వానాకాలం పంటలకు రెండో విడత నీటిని గురువారం విడుదల చేశారు. కుడికాల్వకు 241.65 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 241.65క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. 15రోజుల పాటు కాల్వలకు నీటి విడుదల కొనసాగనుంది.

దుర్వాసన భరించలేం.. ఇంటికి వెళ్లిపోతున్నాం



కోళ్ల ఫారంను తొలగించాలని ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవరకొండ, సెప్టెంబరు 12: పాఠశాల పక్కనే కోళ్లఫారం ఉండటంతో దుర్వాసన భరించలేక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటిబాట పట్టారు. గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పెంచికల్‌పహడ్‌లో ఈ సంఘటన జరిగింది. పెంచికల్‌పహడ్ ఆదర్శ గురుకుల పాఠశాలలో ఆరు నుంచి 12 తరగతులు ఉండగా, 540మంది బాలురు, బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. 100మంది వరకు విద్యార్థినులు ఆదర్శ పాఠశాలలోని హాస్టల్‌లో ఉంటుండగా, మిగిలిన విద్యార్థులు రోజువారీగా ఇంటికి వెళ్లి వస్తుంటారు. పాఠశాల పక్కనే కోళ్లఫారం ఏర్పాటు చేయడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని కొద్దిరోజుల క్రితం ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ప్రార్థన అనంతరం విద్యార్థులు తరగతులను బహిష్కరించి ఇంటిబాట పట్టారు. ప్రిన్సిపాల్ నచ్చచెప్పినప్పటికి విద్యార్థులు వినకుండా తల్లిదండ్రులకు ఫోన్‌చేసి గ్రామాలకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాలు ఆదర్శ పాఠశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం దేవరకొండ ఎంఈవో మాతృనాయక్‌కు, ఇంచార్జ్ ఎంపీడీవో నీలిమాకు విద్యార్థి సంఘాల నేతలు వలమాల గోపిచంద్, వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. కోళ్లఫారంను అక్కడి నుంచి తొలగించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కుంటలో పడి కాడెడ్లు మృతి



నీటికుంటలో మృత్యువాత పడిన ఎద్దులు

గుండాల, సెప్టెంబరు 12: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని సీతారాంపురం గ్రామంలో నీటి కుంటలో పడి గురువారం సాయంత్రం రెండు కాడెడ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చేగూరి పాండు తన చెలకలోని పత్తి చేనులో గుంటుక తోలి తిరిగి సాయంత్రం బావి వద్దకు అరకతో వెళుతుండగా పానాది బాటలో గుర్తు తెలియని వాహనం ఎదురు కావడంతో ఎడ్లు బెదిరి కుంట వైపు పరిగెత్తాయి. నీటికుంటలో పడ్డాయి. ఆ కుంట నిండా నీళ్లు ఉండడం, ఎద్దుల మెడలపై కాడి, గుంటుక కట్టి ఉండడంతో బయటికి రాలేక, నీట మునిగి అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు పాండు చాలా సేపు అయ్యాక గమనించడంతో అప్పటికే మృత్యువాతపడ్డాయి. ఏఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహకారంతో ఎక్స్‌కవేటర్ సాయంతో ఎడ్లను కుంటలోంచి బయటకు తీశారు. సుమారు రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతు పాండు కోరాడు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వలిగొండ, సెప్టెంబరు 12: అక్రమంగా నిల్వ చేసిన గుట్కా ప్యాకెట్లను గురువారం పోలీసులు పట్టివేశారు. ఎస్ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో మురారిశెట్టి కుమార్ అనే వ్యక్తి తన ఇంట్లో నిషేధిత గుట్కా, పొగాకును నిల్వ చేసి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు అతడి ఇంట్లో సోదాలు నిర్వహించారు. మిరాజ్ గుట్కా 66 పెట్టెలు, ఆర్‌ఆర్ గుట్కా 93 ప్యాకెట్లు, సాగర్ గుట్కా 49 ప్యాకెట్లు, వీ1 గుట్కా 29 ప్యాకెట్లు, ఎస్ఆర్ఐ 82 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. సుమారు వాటి విలువ రూ.7,044 ఉందని, సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.















హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు బీఎస్ఎస్ఎన్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురివికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలేదని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "దర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే.. వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రిసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా..సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్య లోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికాదు : బీజేపీ



సూర్యాపేటలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

భానుపురి, సెప్టెంబరు 12: అమెరికా పర్యటనలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పరిస్థితులు అనుకూలిస్తే రిజర్వేషన్లు తీసి వేస్తామని అమెరికాలో చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. మతాలు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఖండించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్నాటి కిషన్, ఎండీ. అబిద్, సలిగంటి వీరేంద్ర, చల్లమల్ల నర్సింహ, పల్సా మల్సూర్‌గౌడ్, విజయ్, వీరబాబు, ఆకారపు పరిపూర్ణ, మంగ్యానాయక్ ఉన్నారు.

మద్దిరాల: ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధితోనే దేశం ముందుకు సాగుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదులో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక హైడ్రా పేరుతో ప్రజల దృష్టి మరల్చుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందసాని శ్రీహరి, బ్రహ్మదేవర శేఖర్, జనార్దన్, విక్రమాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్లు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 12: ప్రైవేట్ టీచర్లు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్ల ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్ కోరారు. జిల్లాకేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ప్రైవేట్ టీచర్లను గురువారం సన్మానించారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలన్నారు. గుర్తింపుకార్డులు, బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జె. నర్సింహారావు, రాంబాబు, ఉయ్యాల నర్సయ్య, దోసపాటి వీరయ్య, నాగమణి, శ్రీనివాస్, సోమరాజు, సైదిబాబు, దుర్వాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 12: విద్యార్థులు ఇష్టపడి చదవాలని బాలల పరిరక్షణ విభాగం జిల్లా కౌన్సిలర్ శోభారాణి అన్నారు. 'పిల్లల చట్టాలు-వారి సమస్యలు' అనే అంశంపై మండలంలోని జలాల్‌పురం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. బాలలకు 50రకాల హక్కులున్నాయని, అందులో జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్య హక్కు, అభివృద్ధి చెందే హక్కులు ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థికీ ఆలోచనలో మార్పు రావాలని, భవిష్యత్తుపై లక్ష్యంతో చదివి సమాజంలో ఉన్నత స్థాయికి చేరేలా చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అశోక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖైరున్నీసబేగం ఉన్నారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి : సీపీఎం

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 12: ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు కడారి లింగయ్య, కండెం లింగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని వెలిశాల ఎస్సారెస్పీ కాల్వను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడిచినా నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు నష్టపోయారని, సరైన సమయంలో నీటిని విడుదల చేయకపోవడంతో నారు, పెట్టిన నాట్లు ఎండిపోయాయన్నారు. ఇప్పటికైనా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్, శ్రీను, సోమయ్య, యాకయ్య ఉన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 12: వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని 32, 20వ వార్డు మహిళలు కోరారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇబ్బంది పడుతున్న వరద బాధితుల కోసం సేకరించిన నిత్యావసర సరుకులను గురువారం పంపించారు. ఖమ్మం వరద బాధితుల కోసం 20, 32వ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి నిత్యావసర సరుకులు, దుస్తులు, ఇతర సామగ్రి సేకరించినట్లు డాకా విజయలక్ష్మి తెలిపారు. కార్య క్రమంలో సోమగాని లక్ష్మణ్‌నాయుడు, రాచూరి అన్నపూర్ణ, మాచర్ల అన్నపూర్ణ, గుండా నర్మద, పొదిళ్ళ ఉమా, మల్లెల ధనలక్ష్మీ, కైరవకొండ లక్ష్మీ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని కూచిపూడి, రెడ్లకుంట గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో 500మంది వరద బాధితులకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనగాల నారాయణ, వంగవీటి శ్రీనివాసరావు, ఓరుగంటి పురుషోత్తం, జల్లా జనార్దన్, సంపెట భాగ్యరాజ్, ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, గాదరి పుల్లారావు, శెట్టికిరణ్, పెద్దకొండ గంగయ్య, నర్సింగరావు, అరుణ, స్వాతి, గోపి, చింతకుంట్ల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మూసీనది వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నేరేడుచర్ల, సెప్టెంబరు 12: మండలంలోని చిల్లేపల్లి గ్రామ సమీపంలోని మూసీనది వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి, ఎస్ఐ రవీందర్, ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ గురువారం పరిశీలించారు. నేరేడుచర్ల పరిసర ప్రాంత మండలాల నుంచి మూసీనదికి గణపతి విగ్రహాల నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉండడంతో వంతెన సమీపంలోని పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగించారు. విద్యుత్ లైన్లు బారికేడ్లు ఏర్పాటు పరిశీలించారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



శంకర్, కన్నయ్య

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 12: ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డివిజన్ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.విజయ్‌శంకర్, కార్యదర్శిగా కన్నయ్య, మహిళా కార్యదర్శిగా సుమ, ఉపాధ్యక్షుడిగా ఉపేందర్, కోశాధికారిగా శ్రీనివాస్, సభ్యులుగా ప్రసాద్, బాబు ఎన్నికయ్యారు. ఎల్ఐసీలో ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 57జీవో ప్రకారం ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 12: యువతికి న్యాయం చేసేందుకు వెళ్లిన తమపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని, కేసులు ఎత్తి వేయాలని మహిళా సంఘ జిల్లా నాయకురాలు పిడమర్తి నాగేశ్వరీ అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులతో కలిసి మాట్లాడారు. జిల్లాకేంద్రానికి చెందిన జయమ్మ కుమారుడు కిరణ్‌కుమార్‌తో కల్పన వివాహం కాగా, కొద్దిరోజుల తర్వాత కిరణ్‌కుమార్ మరో వివాహం చేసుకోవడంతో యువతికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో 2023 ఫ్రిబవరిలో మాట్లాడడానికి వెళ్లారని తెలిపారు. 18నెలల తర్వాత 12మందిపై కేసు నమోదైందని పోలీసులు చెప్పారని తెలిపారు. ఈ సమావేశంలో గంధం మరియమ్మ, జాటోతు ప్రమీల, జ్యోతి, బీబీపాషా, సుశీల తదితరులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

WANTED

★ Wanted Teachers Physical science, Primary maths. Contact number +919985464682 +919246373831

AJY_

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/-Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413656 9985413365

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9985410384

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించుకోవాలని పాఠకులకు సూచించడమైనది. ప్రకటనకర్తలు ప్రకటించిన లేదా ప్రచురించిన ప్రకటనలతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించడం లేదా క్లెయిమ్‌లకు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

తెలంగాణ సాయుధ పోరాటం గొప్పది

తుంగతుర్తి, సెప్టెంబరు 12: రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర గొప్పదని, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం తమ ప్రాణాలు అర్పించి పోరాటం కొనసాగించారని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న శౌర్యయాత్ర గురువారం కొత్తగూడెం గ్రామానికి చేరుకుంది. భీమిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా ఈ ప్రాంతంలో 10లక్షల భూములను పేదవారికి పంచినట్లు గుర్తుచేశారు. నాలుగు వేల మంది అమరవీరుల బలిదానంతో మూడు వేల గ్రామాలు స్వరాజ్యాన్ని సాధించాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, బుర్ర శ్రీనివాస్, ఫులుసు సత్యం, నాయకులు తాటి విజయమ్మ, సుదర్శన్, ముత్తయ్య, మల్లయ్య, పాపయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్, నరసింహ పాల్గొన్నారు.

నూతన్‌కల్: పేదల కోసం పోరాడి అమరులైన నాయకుల ఆశయ సాధనకు కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి కోరారు. మండలంలోని చిల్పకుంట్లలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, కందాళ శంకర్‌రెడ్డి, ఫులుసు సత్యం, బొజ్జ శ్రీనివాస్, తొట్ల లింగయ్య, కూసు సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, తిరుమలేష్ ఉన్నారు.

కోదాడ రూరల్: కమ్యూనిస్టుల పోరాట ఫలితమే తెలంగాణ విముక్తి అని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ 76వ వార్షికోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కొన్ని పార్టీలు చరిత్రను వక్రీకరించి వారికి అనుకూలంగా మార్చుకున్నాయన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ విముక్త పోరాటమే నిజమైన పోరాటమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు, పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్ పాల్గొన్నారు.



తుంగతుర్తి: బీఎన్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సూర్యాపేటటౌన్: ఈ నెల 13వతేదీ నుంచి 17వ తేదీ వరకు విద్రోహ దినంగా నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నిజాం ప్రభు భూస్వాముల, జాగీర్‌దారుల, దేశ్‌ముఖ్‌లు నిరంకుశ పాలన సాగిస్తున్న సమయంలో కమ్యునిస్టుల నాయకత్వంలో ప్రజాపోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, పోలెబోయిన కిరణ్, నర్సింహారావు, అశోక్‌రెడ్డి, బండి రవి, నర్సిరెడ్డి, వినోద్‌రెడ్డి, శ్రీధర్, లింగయ్య, రామనర్సయ్య పాల్గొన్నారు.

చిలుకూరు: తెలంగాణ అమరవీరుల ఆశయ సాధనకు కృషిచేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డా నారాయణరావు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో బేతవోలు, చిలుకూరు, నారాయణపురం, జెర్రిపోతులగూడెం గ్రామాల్లో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్థూపాలను ఆవిష్కరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, ఉస్తెల సృజన, మండవ వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, కొండా కోటయ్య, చేపూరి కొండలు, మల్లేశ్వరి, రెమిడాల రాజు, సాహెబ్ అలీ పాల్గొన్నారు.



చిలుకూరు: నారాయణరావును సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

తుంగతుర్తి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని సీపీయూఎస్ఐ దళిత బహుజన శ్రామిక విముక్తి రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో దళం సేదతీరుతున్న సమయంలో ఏకపక్షంగా కాల్పులు జరిపి ఎన్‌కౌంటర్ అని కట్టుకథ అల్లుతున్నారని, హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరారు.

స్పాట్ అడ్మిషన్లలో అవకతవకలు : విద్యార్థుల తల్లిదండ్రులు

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 12: మండల పరిధిలోని ఇమాంపేట గురుకుల గురుకుల పాఠశాల స్పాట్ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళనకు దిగారు. దురాజ్‌పల్లి- నేరేడుచర్ల రహదారిపై గంట పాటు రాస్తారోకో చేశారు. ఇమాంపేట గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వతరగతి వరకు 99సీట్లు ఖాళీగా ఉంటే, ఉదయం రెండు సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయని, మధ్యాహ్నం 45 సీట్లు ఖాళీగా ఉన్నాయని గంట గంటకు మాట మారుస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తల్లిదం డ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 99 సీట్లకు 3వేల మందిని ఎందుకు పిలిచారో చెప్పాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిం చే అధికారులు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల లెటర్ ప్యాడ్లు ఉంటేనే కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పైరవీలు ఉంటేనే అడ్మిషన్లు దొరుకుతాయని, లేకుంటే ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు అక్కడి చేరుకుని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేయించారు.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

'చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి'

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 12: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 30వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. జనార్దన్ అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి తర్వాత కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదిస్తూ 40కోట్ల కార్మికులకు ద్రోహం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాగయ్య, శ్రీను, నర్సింహారావు, నర్సిరెడ్డి ఉన్నారు.

మద్దిరాల: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు నాగెల్లి నర్సయ్య అన్నారు. సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గురువారం సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు మాదాసు యాదగిరి, మరికంటి ఉపేందర్, శ్రీను, ఉప్పలయ్య, మాదాసు రమేష్, గోరెంట్ల ఉపేందర్ ఉన్నారు.

వ్యవసాయ విధానాలపై అధ్యయనం

నేరేడుచర్ల, సెప్టెంబరు 12: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్‌కు చెందిన బీఎస్సీ వ్యవసాయ కోర్సు విద్యార్థులు గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ ఆధ్వర్యంలో నేరేడుచర్ల మండలంలోని దాచారం గ్రామంలో గురువారం గ్రామీణ వ్యవసాయ విధానాలపై అధ్యయనం చేశారు. వ్యవసాయ విద్యార్థులు గ్రామ పటం ద్వారా గ్రామంలో కలిగే మౌలిక వసతులు, సదుపాయాలు, వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పండించే పంటల గురించి వివరిస్తూ రైతులు ఎక్కువ సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపడం లేదని, పత్తి రైతు రసాయన ఎరువులను ఉపయోగిస్తున్నారన్నారని కొద్ది మొత్తంలోనైనా సేంద్రీయ వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గడ్డిపల్లిలోని కేవీకే ప్రోగ్రాం అసిస్టెంట్ ఆకుల నరేష్, రైతులు రామకృష్ణ, వెంకటేష్, సాంబయ్య, నాగరాజు, వినోద్, గోపాల్, ఎల్లయ్య, సోమయ్య పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 12: వినాయక నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం జిలా కేంద్రంలోని 43వార్డులో నామా అరుణప్రవీణ్, వెలుగు వెంకన్నతో కలిసి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. 19వ వార్డు భగత్‌సింగ్‌నగర్‌లో నాయకులు సుంకరి రమేష్, వాసంశెట్టి వెంకన్న, కోల శ్రీనివాస్, పాలవరపు శ్రీశైలం, తోటశ్రవణ్‌కుమార్ అన్నదానం చేశారు. 1వ వార్డులో వేములకొండ పద్మ, పంతంగి దశరథ, కుశనపల్లి సురేందర్, శంకర్‌యాదవ్ అన్నదానం చేశారు.



అన్నదానం చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

ప్రాంతీయ పశువైద్యశాలలో తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి శ్రీనివాసరావు

కోదాడ రూరల్, సెప్టెంబరు 12: కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలను జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి డాక్టర్ బి. శ్రీనివాసరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం పశువైద్యశాలలో రికార్డులు పరిశీలించారు. పశుపోషకులకు ఎంతో ఉపయుక్తమైన ఆడదూడలు పుట్టే విభజన చేసిన పశు వీర్యాన్ని విరివిగా ఉపయోగించాలని, పశుఔషధ బ్యాంక్ ఏర్పాటు ఆలోచన దేశంలోనే తొలిసారిగా కోదాడలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పశుఫలదీకరణ శిబిరాల ఏర్పాటుతో పశుపోషకులకు చేయూతనివ్వాలని ఆయన సూచించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

చివ్వెంల, సెప్టెంబరు 12: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని తిర్మలగిరి గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ సందీప్(24) తల్లిదండ్రులు గతంలో చనిపోవడంతో తన నాయనమ్మ లక్ష్మమ్మ వద్ద ఉంటూ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి గ్రామంలోని ఓ వినాయకుడి వద్ద నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నాడు. అక్కడి నుంచి వెళ్లిన సందీప్ ఇంటికి రాకపోవడంతో నాయనమ్మ లక్ష్మమ్మ గ్రామంలో వెతికింది. గురువారం ఉదయం గ్రామం పక్కన ఉన్న చెరువులో సందీప్ మృతదేహం తేలిఉండడాన్ని స్థానికులు గమనించి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సందీప్‌కు ఎలాంటి వివాదాలు లేవని, ఆర్థిక పరమైన ఇబ్బందులు లేవని అతని మృతిపై తమకు అనుమానం ఉన్నాయని సందీప్ బాబాయి రాచకొండ వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గుణగంటి వెంకన్న తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నేరేడుచర్ల, సెప్టెంబరు 12: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నేరేడుచర్ల పట్టణంలో గురువారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన మల్లెబోయిన మల్లేష్(42) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లేష్ భార్య రజిత ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు ఎస్ఐ తెలిపారు. మల్లేష్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రెండు లారీల మధ్య ఇరుక్కుని యువకుడు మృతి

మేళ్లచెర్వు, సెప్టెంబరు 12: రెండు లారీల మధ్య ఇరుక్కొని యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలకేంద్రంలోని సిమెంట్ కంపెనీ లారీ యార్డులో గురువారం జరిగింది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం... మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామానికి చెందిన ఆకారపు మహేష్ (25) లారీ ట్రాన్స్‌పోర్టులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి లారీని లోడింగ్ చేసి రాత్రి సమయంలో అక్కడే పార్కింగ్ చేసి గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బయలు దేరుతామని లారీ టైర్లు చెక్ చేస్తున్న క్రమంలో మండల పరిధిలోని కందిబండ గ్రామానికి చెందిన రంజు గోపి తన లారీని వెనుకకు నిర్లక్ష్యంగా నడపడంతో మహేష్ రెండు లారీల మధ్య చిక్కుకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మహేష తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూర్‌నగర్, సెప్టెంబరు 12: మండల పరిధిలోని గోపాలపురంలో చిల్లేపల్లి మూసినది నుంచి గురువారం హుజూర్‌నగర్‌కు ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో గరిడేపల్లికి చెందిన పెండెం సైదులు, పెండెం పాపులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏచూరి మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరనిలోటు

నూతన్‌కల్, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషిచేసిన ఏచూరి మృతి బాధాకరమన్నారు. సమావేశంలో కొలిశెట్టి యాదగిరిరావు, కందాళ శంకర్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్ ఉన్నారు.

మునగాల: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. మండలకేంద్రంలోని సుందరయ్య భవనంలో ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి. సాగర్, జాన్‌వెస్లీ, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకటరెడ్డి, చందా చంద్రయ్య, బుర్రి శ్రీరాములు, స్టాలిన్‌రెడ్డి, స్వరాజ్యం, సైదా, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం పట్ల పెన్‌పహాడ్ మండల సీపీఎం కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. నాయకులు సీతారాం ఏచూరి చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయ కులు నెమ్మాది వెంకటేశ్వర్లు, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, రవి, రణపంగి కృష్ణ, నెమ్మాది లక్ష్మమ్మ, అడివయ్య, సాలయ్య తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి రూరల్: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య అన్నారు. మండలంలోని తాటిపాముల గ్రామంలో మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణంతో దేశం విజ్ఞత గల వ్యక్తిని కోల్పోయిందన్నారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు కాంతయ్య, సోమయ్య, చంద్రనారాయణ, లక్ష్మయ్య, మల్లయ్య ఉన్నారు.

తిరుమలగిరి: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకుడు కడెం లింగయ్య అన్నారు. తిరుమలగిరిలో ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మూల సత్తయ్య, మిర్యాల యాదయ్య, అబ్రహం, చారి, లక్ష్మి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, యల్లావుల రాములు అన్నారు. గురువారం సీతరాం మృతి పట్ల సంతాపం తెలిపారు. సీతారం ఏచూరి మృతికి సీపీఎం నాయకులు పల్లె వెంకటరెడ్డి, ములకపల్లి సీతయ్య, టీడీపీ నాయకులు బెల్లంకొండ రామజోగి, కాంగ్రెస్ నాయకులు మేకల నాగేశ్వరరావు, గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీను, జడ శ్రీను, రాంరెడ్డి, కోటయ్య, రమణ తదితరులు సంతాపం తెలిపారు.



చివ్వెంల: రాజకీయ అనుచరుడిగా తన ఎదుగుదలకు కృషి చేసిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు దారోజు జానకిరాములు మృతి బాధాకరమని తెలంగాణ పర్యాటక, అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందగా గురువారం జిల్లాకేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్‌లోని జానకిరాములు నివాసం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుంజలూరు సర్పంచ్‌గా, ఆరుసార్లు టీడీపీ మండల అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు. ఆయన వెంట నాయకులు వెలుగు వెంకన్న, జ్యోతికర్ణాకర్, మాజీ ఎంపీటీసీ దరావత్ సాగర్‌నాయక్ పాల్గొన్నారు.

మునగాల: వినాయక నవ రాత్రుల అనంతరం నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ బి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో గురువారం జరిగిన శాంతి సంఘం సమావేశంలో మాట్లాడారు. మండల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్. వి. ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని 3వ వార్డులోని ఎన్జీవో కాలనీలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి మండపం వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. కాలనీకి చెందిన పాలెపు శిల్పానాగరాజు దంపతులు రూ.1.18 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, దేవరం వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కోతి లింగారెడ్డి, శరణ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: ముత్యాలమ్మ జాతర నిర్వహణకు సూచికగా జాతర కమిటీ ఆధ్వర్యంలో సల్లకుండ సల్లకుండ ఎత్తి జాతరకు శ్రీకారం చుట్టారు. ముత్యాలమ్మ తల్లికి గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు పట్టణ ప్రజలు ఇంటింటికి వెళ్లి అమ్మవార్లకు బోనాలు, కానుకలు స్వీకరించనున్నారు. కార్యక్రమంలో ప్రసాద్, రాము, అమర్, అరవింద్‌రెడ్డి, వేముల నర్సయ్య, రామరావు, నరసింహర్మావు, నరసింహ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ వ్యవసాయ శాఖ ఏడీఏగా రవీందర్ నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొల్లాపూర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ ఏడీఏగా పనిచేసిన సంధ్యారాణి రాజేంద్రనగర్‌కు బదిలీకాగా హుజూర్‌నగర్‌కు రవీందర్ వచ్చారు.

హుజూర్‌నగర్ రూరల్: వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోదండరెడ్డిని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, వెంకటేశ్వరరెడ్డి, మల్లేశం, అంజిరెడ్డి పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండల పరిధిలోని దిర్శించర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని తోకలవారిగూడెం గ్రామానికి చెందిన లబ్ధిదారుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకటరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మచ్చ శ్రీనివాస్, దేవులపల్లి శంకరాచారి, చింతమళ్ల సైదులు, గజ్జల కోటేశ్వరావు, సోమయ్య, సైదులు, నవీన్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాపై స్పష్టమైన ప్రకటన చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుపులేటి నర్సింహారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాకాలం సీజన్ ముగుస్తున్నా ఇప్పటి వరకు రైతు భరోసా ఎందుకు వేయలేదో రైతులకు సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. రుణమాఫీ ప్రక్రియ కూడా సరిగా అమలు కాక రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారన్నారు. ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు.

నేరేడుచర్ల: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ కోరారు. వన మహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీలోని 8, 11వ వార్డుల్లో కౌన్సిలర్ కొదమగుండ్ల సరితతో కలిసి ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, నజీర్, శివలక్ష్మి, సైదులు, జాని, శ్రీను, నగేష్, రాంబాబు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్ఆర్‌కే అపార్టుమెంట్‌లో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితులు ఇరువంటి శ్రీపాదశర్మ, సంతోష్‌శర్మ మహిళలతో అమ్మవారికి పూజలు చేయించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాచకొండ శ్రీను, కొత్త లక్ష్మణ్, కందిబండ హరిప్రసాద్, భువనగిరి అంజయ్య, ఈగ శ్రీనివాసరావు, అరిబండి కిరణ్‌కుమార్, జగని శ్రీను పాల్గొన్నారు.

గరిడేపల్లి: నిరుపేదల కుటుంబాలకు అండగా జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ఉంటుందని ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవిందరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పొనుగోడు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన నందిపాటి వెంకటేశ్వర్లు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతిచెందాడు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అనంతు చంద్రయ్య, చిలక పిచ్చయ్య, కుర్రి వెంకన్న, సామ్రాట్, సైదులు, పకీరా, వెంకటయ్య, కిరణ్ పాల్గొన్నారు.

నూతన్‌కల్: 25 సంవత్సరాలుగా కబ్జాలో ఉన్న తన భూమిని మరొకరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని మండల పరిధిలోని బికుమళ్ల గ్రామానికి చెందిన రైతు కప్పల నర్సయ్య తహసీల్దార్ శ్రీనివాసరావుకు గురువారం ఫిర్యాదు చేశాడు. తనకు గ్రామ శివారులో సర్వే నెంబర్ 197లో నాలుగు గుంటలు, 198లో 25గుంటల భూమిని అదే గ్రామానికి సంపెట పద్మ పట్టా చేయించుకుందని తెలిపారు. ఆ భూమిని తనకు పట్టా చేయాలని తహసీల్దార్‌ను కోరారు. విచారణ చేసి జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామని తహసీలార్ తెలిపారు.

తిరుమలగిరి: తిరుమలగిరి జెడ్పీహెచ్ఎస్‌కు పూర్వ విద్యార్థి నందాపురం గ్రామానికి చెందిన కోటమర్తి అనిల్‌కుమార్ రూ.25వేల విలువైన సీసీ కెమెరాలను గురువారం పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దామెర శ్రీను, జానయ్య, సోమయ్య, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

